క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రచారం ఇలా..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ, లుంబేసు, పి.ఆమిటి పంచాయతీల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

541 బోర్లకు మరమ్మతులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 541 తాగు నీటి బోర్లకు మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు మార్చి నెలలో ప్రారంభించిన క్రాష్ ప్రోగ్రాం ద్వారా మండలంలోని అన్ని తాగునీటి బోర్లను మరమ్మతు చేపట్టడం జరిగిందన్నారు. వాటితో పాటు రక్షిత మంచి నీటి పథకాల ద్వారా నీటి సరఫరాలో తెలెత్తిన సమస్యలను కూడా పరిష్కరించి ప్రజలకు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు.

3 నామినేషన్లు

సీతంపేట: పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం వివిధ పార్టీల అభ్యర్థులు 3 నామినేషన్లు వేసినట్టు రిటర్నింగ్ అధికారి శుభమ్ బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన అభ్యర్థి ఎస్.జయకృష్ణ, స్వతంత్ర అభ్యర్థి ఎస్.పాండురంగ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సవర చంటిబాబు నామినేషన్ వేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కూనాయవలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

తెర్లాం: మండలంలోని కూనాయవలస, ఎం.ఆర్ అగ్రహారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.రాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలతో కలిసి వెళ్లిన ఆమె.. ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలున్నాయా.. లేదా.. ఇంకేమైనా సమస్యలున్నాయా అని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, ఇప్పటికే కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఎక్కడైనా ఏ కేంద్రంలోనైనా ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వో నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఎన్నికల కోడ్ పక్కాగా అమలు జరిగేలా చూడాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై నిఘా ఉంచాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. బుధవారం మండలంలోని లచ్చారాయపురంలో మహిళలు, కిశోరి బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రక్తహీనత బారినపడకుండా జాగ్రత్త వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తినాలన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

రాజాం సిటీ: రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని సోపేరు గ్రామ సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి, అక్కడి రికార్డులను పరిశీలించారు. ప్రజాసమస్యలపై సత్వరమే స్పందించాలని, ఎప్పటి సమస్యలు అప్పుడే వీలైనంత వరకు పరిష్కరించాలని తెలిపారు.

పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు



పాలకొండ నియోజకవర్గంలోని వాటపాగు సచివాలయం



కురుపాం నియోజకవర్గంలోని బియ్యాలవలస సచివాలయం

పాలకొండ రూరల్/ కురుపాం:

జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో నిజమైంది. దీనికి గ్రామ సచివాలయే వ్యవస్థ నిదర్శనం. ఈ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది యువత, నిరుద్యోగులకు సర్కారు కొలువు లభించింది. దీని ద్వారా అధికార యంత్రాంగాన్ని పల్లె వాకిటకి చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కింది. గతంలో ప్రజలకు ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సి వచ్చేది.

జగనన్న పాలనలో పరిస్థితులు మారాయి. సంక్షేమ లబ్ధి నుంచి ఏ సమస్య తీరాలన్నా సచివాలయ వ్యవస్థ ద్వారానే గ్రామాల్లోనే పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

పట్టాదారు పాసు పుస్తకాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, రిజిస్ట్రేషన్లు, వివాహ ధ్రువపత్రాలు, విద్యుత్ మీటర్లు, లైసెన్సులు, పింఛన్ల మంజూరు ఇలా 526 సేవలకు సంబంధించి ఏ పథకం కావాలన్నా వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం లేదు. పంచాయతీలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన సచివాలయా ద్వారా సేవలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారు.

సచివాలయ వ్యవస్థ అద్భుతం



క్షేత్ర స్థాయిలో జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. ఎటువంటి కష్టం లేకుండా సచివాలయాల వద్ద పనులు జరుగుతున్నాయి. అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఎటువంటి అవగాహన లేకున్నా సచివాలయం వద్దకు వెళితే చాలు అవసరమైన పనులు చేసి పెడుతున్నారు.
– మిడితాన సూర్యనారాయణ, ఎన్‌కే రాజపురం, పాలకొండ పట్టణం

సేవలన్నీ ఒక్క చోటే...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఉన్న ఊర్లోనే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయి. కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న కొన్ని గంటల్లోనే ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చారు. ఇది కదా గ్రామ స్వరాజ్యం అంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగానే ఉంటాం. – రెడ్డి రాజేశ్వరి, గుమ్మలక్ష్మీపురం

పాలకొండ నియోజకవర్గంలో సచివాలయాల ద్వారా అందిన సేవలు

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	అందించిన సేవలు
పాలకొండ	32	22	1,34,826
పాలకొండ పట్టణం (వార్డులు)	20	09	55,201
భామిని	27	16	72,580
సీతంపేట	52	31	80,502
వీరఘట్టం	34	24	69,976

కురుపాం నియోజకవర్గంలో...

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	అందించిన సేవలు
కురుపాం	23	22	66,786
కొమరాడ	32	20	60,146
జీఎంవలస	31	25	72,452
గరుగుబిల్లి	25	13	41,676
గుమలక్ష్మీపురం	27	24	72,501

భావితరాలకు భరోసా జగనన్న



విక్రమపురంలో ఎమ్మెల్యే కళావతితో పాటు జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి టీడీపీని తరిమికొడదాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: భావితరాలకు భరోసా జగనన్న.. అవ్వాతాతలకు ఆప్తుడు జగనన్న, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఆపద్బాంధువుడు మన జగనన్న అని, అన్ని వర్గాల వారికి అండదండగా ఉంటున్న జగనన్నకు అందరం అండగా ఉందామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని విక్రమపురంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనలో ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుంటే చూడలేని ప్రతిపక్షాలు పొత్తులు పెట్టుకుని దొంగల ముఠాగా మారారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ, జనసేనకు అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు.

వలంటీరు వ్యవస్థ ఉండాలంటే మళ్లీ జగన్ రావాలి

రాష్ట్రంలో ఓ నూతన శకంగా ఆవిర్భవించిన సచివాలయ వ్యవస్థ, వలంటర్ వ్యవస్థలు రానున్న రోజుల్లో ఉండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కళావతి ప్రజలకు తెలిపారు. రాష్ట్రంలోని పేదలకు న్యాయం జరగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని అన్నారు. టీడీపీ చెప్పే అబద్ధపు హామీలను ప్రజలు నమ్మవద్దని కోరారు. మీకు మేలు జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కళావతి కోరారు. మేము ప్రజలకు మేలు చేసాం కాబట్టే ఇంత నిజాయితీగా ఓటు అడుగుతున్నామని అన్నారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున మేమంతా సిద్ధం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల మహేష్, మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటరమణ, మాచర్ల జగన్, గుడివాడ మహేష్, మాచర్ల బాలాజీ, ఎం.రవికుమార్, దుర్గారావు, మురళీకృష్ణ, సిరిపురం లక్ష్మునాయుడు, ఎం.వినోద్, జి.వైకుంఠరావు, సాకేటి గోపినాయుడు, శ్రీనివాసరావు, జగది,అన్నందొర, రామకృష్ణ, జంపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం మళ్లీ జగనే రావాలి



సన్యాసిరాజుపేటలో ఎన్నికల ప్రచార సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఆర్టీవలస, సన్యాసిరాజుపేట, పెదగుడబ, వల్లరగుడబ, చినగుడబ, గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి ప్రజలు హారతులు పట్టారు. డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అభిమానుల కేరింతల నడుమ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా తనూజారాణిని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని గత టీడీపీ పాలనలో జరిగిన అరాచకాలను గుర్తు తెచ్చుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగితేనే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శక పాలన అందించడం జరిగిందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంతవరకు అందించలేదన్నారు. గడచిన ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పట్ల అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేసుకొని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. గంగసాగరం రహదారి అభివృద్ధితో పాటు కల్వర్టులను నిర్మిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ రహదారి అభివృద్ధి చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటు అడగనని రాయిందొరవలస, ఎస్ఆర్‌పేట గ్రామ సభల్లో ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఆయా గ్రామ సర్పంచ్‌లు బేత వెంకటనాయుడు, జాగాన సరస్వతి, ఎంపీటీసీలు బి.లక్ష్మి, నాయకులు పి.సింహాచలంనాయుడు, బి. శివున్నాయుడు, జె.మురళీ, బి. పకీరునాయుడు, అల్లు లక్ష్మీనారాయణ, ఎం. అప్పారావుతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి



సాలికిరిలో దేవతా విగ్రహాల తిరువీధిలో ఘటాలతో మహిళలు

భామిని: మండలంలోని సాలికిరిలో వెలసిన శ్రీభూదేవి, శ్రీదేవి సమేత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉపాలయాలు పున ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, శ్రీలక్ష్మిదేవి, గరుత్మంతుడు విగ్రహాల ప్రతిష్ఠాపన హోమాధికాలు నిర్వహించారు. నూతన దేవతా విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. మహిళలు కలశాలతో పవిత్ర జలాలు పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు.

పరామర్శ



వెంకటరావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన మెడికల్ షాప్ నిర్వాహకుడు కింతలి వెంకటరావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడే శత్రుచర్ల పరీక్షిత్ రాజు బుధవారం పరామర్శించారు. ఈ మేరకు వెంకటరావు తల్లి సావిత్రమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే పరామర్శించిన పరీక్షిత్ రాజు వెంకటరావును, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

జెండాలెక్కువ.. జనం తక్కువ...

భామిని: పాలకొండ జనసేన అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ఘట్టానికి మండలం నుంచి వాహనాలు, వాటికి కట్టిన వివిధ పార్టీల జెండాలే ఎక్కువ కనిపించాయి. కార్యకర్తల సందడి లేకుండా పోయింది. జనాల కోసం బుక్ చేసుకొన్న వాహనాలు ఎదురు చూడడం కనిపించింది. ఈ అభ్యర్థి పట్ల టీడీపీ శ్రేణులకు ఆసక్తి లేకపోవడంతో వెళ్లలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. పాలకొండ టికెట్ ఆశించి భంగపడ్డ పడాల భూదేవి వర్గం వారు డుమ్మ కొట్టారని పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. దీంతో జనాలు రాలేదని చర్చించుకుంటున్నారు.

నేడు మండలంలో కళావతి ప్రచారం

పాలకొండ: మండలంలోని పనుకువలస, చింతాడ, వాటపాగు, దుగ్గి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గురువారం ప్రచారం చేపడతారని ఆ పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రచారం జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నానాలు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి చక్రస్నాన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సీహెచ్ గోపాలకృష్ణ దంపతులు స్వామివారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం స్వామివారిని సువర్ణముఖి నదీ తీరానికి తీసుకువెళ్లి కొబ్బరినీరు, పంచామృతాలు, నదీ జలాలలో చక్రస్నానాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రేగిడి: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సోహినీ రాఘవ్ కోరారు. మండలంలోని వన్నలి గ్రామంలో 104 అంబులెన్స్ ద్వారా ప్రజలకు బుధవారం వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన సంబంధిత వారాల్లోనే 104 వాహనం వస్తుందని, దీనిద్వారా 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు 64 రకాల మందులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియా, ఏఎన్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.


ఫైలేరియా సర్వేకి ప్రజలు సహకరించాలి



రక్తపూతలు సేకరిస్తున్న హెల్త్ సూపర్‌వైజరు శర్మ, సిబ్బంది

సీతానగరం: ఫైలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పీహెచ్‌సీ వైద్యులు బి.పావని చెప్పారు. మండలంలోని పణుకుపేట, రంగంపేట, బల్లకృష్ణాపురం, బగ్గందొరవలస, బక్కుపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి సుమారు 125 మంది నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు చెప్పారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షించి వ్యాధి నిర్ధారణ అయితే తగిన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. శాంపిల్ సేకరణకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఫైలేరియా నివారణపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో విజయనగరం డీఎంహెచ్‌ఓ కార్యాలయం హెచ్ఎస్ లోకనాథం, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజరు శర్మ, సిబ్బంది హరికృష్ణ, చంద్రినాయుడు, చిన్నారాయణ, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ బుజ్జి, స్వర్ణ, లక్ష్మీ, సరస్వతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధులకు సంబంధించిన రెండో విడత శిక్షణా తరగతుల నిమిత్తం ఉపాధ్యాయులందరూ అందుబాటులో ఉండాలని ఎంఈఓ సామల సింహాచలం ఆదేశించారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం పూర్తయ్యాయని, అదేవిధంగా రెండో విడత శిక్షణ కార్యక్రమం త్వరలోనే ఉంటుందన్నారు. అందువలన సెలవుల్లో ఉపాధ్యాయులందరూ అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలుగా ఎంపికై న పాఠశాలల హెచ్‌ఎంలు పాఠశాల తాళాలను ఆ గ్రామంలోని బీఎల్‌ఓలకు అందచేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్ వంటివి ఏర్పాటు చేసి సమాచారం అందజేయాలన్నారు.

కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.300

సంతకవిటి: కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో హరనాథరావు అన్నారు. మండలంలోని జావాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించిన ఆయన.. వేసవి ఎండల కారణంగా వడదెబ్బ బారినపడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఎండ తక్కువగా ఉన్న సమయంలో పని చేసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్.. శిబిరానికి హాజరైన 52 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగాలను నయం చేసేందుకు ఆయుర్వేదం చాలా మంచిదని, ప్రతిఒక్కరూ ఈ మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడి లక్ష్మునాయుడు, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న పీవో శుభం బన్సల్

సీతంపేట: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం బన్సల్ అన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్‌ల గడువు ముగిసిన అనంతరం పరిశీలనకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సభ్యులు

కురుపాం: మండల కేంద్రంలో జన జాగరణ వేదిక ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జన జాగరణ వేదిక విభాగ్ సహ కార్యవహ జనార్దన్, సహాయ ప్రాంత ప్రచారక్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సదస్సులో కురుపాం, శివ్వన్నపేట, వలసబల్లేరు, మామిడిమానుగూడ గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

పాలకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న స్ట్రాంగ్ రూంలను తహసీల్దార్ వరహాలు బుధవారం పరిశీలించారు. ఇప్పటికే అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది, వాహనాలు రాకపోకలకు సంబంధించి రూట్ మ్యాప్‌లను అందించామని తెలిపారు. ఆయనతో పాటు సర్వేయర్ వెంకటరావు ఉన్నారు.